క్లుప్తంగా

'సిద్ధం'విజయవంతంపై హర్షం



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాప్తాడులో సిద్ధం సభ పెద్ద ఎత్తున విజయవంతమై, పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందని నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ ద్వారా సీఎం జగనన్న నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం వైఎస్సార్‌సీపీదే అని విశ్వేశ్వరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. పి.నారాయణపురం, ఎంఎంహళ్లి గ్రామాల ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతుల ముంగిటకే సేవలు

కూడేరు: రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతుల ముంగిటకే సేవలు అందుతున్నాయని ఎంపీపీ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కమ్మూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న 9:30 గంటలకు కమ్మూరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయ కర్త విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో సర్పంచ్ చిన్న రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



కూడేరు: శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వరస్వామి ఆలయానికి మాఘ మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు శివశంకర్ శాస్త్రి మహేష్, ప్రవీణ్ స్వామి శివపార్వతులకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీలు నరసింహులు, పెద్దన్న

ఉరవకొండ: నవరత్నాలు–పేదలందరికి ఇళ్ల పథకం కింద అందించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉరవకొండ, బెళుగుప్ప ఎంపీపీలు నరసింహులు, పెద్దన్నలు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐదు సచివాలయాల పరిధిలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభమైంది. ఎంపీడీఓ అమృతరాజ్, ఈఓఆర్డీ చంద్రమౌళి, ఈఓ గౌస్‌సాహెబ్‌ల పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించుకున్న పత్రాలను ఆయా లబ్ధిదారులకు ఎంపీపీలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ



ఆయతపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన బొడ్రాయి

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆయతపల్లిలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. 7 గంటలకు గంగపూజ, గోపూజ, జ్యోతిప్రజ్వలన, గురుపూజ, 9 గంటలకు మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విగరణం, నాంది, కలశస్థాపన చేశారు.

రేపు విగ్రహాల ప్రతిష్ఠ: గ్రామంలోని ఆదిమల్లయ్య స్వామి ఆలయంలో బుధవారం శ్రీగణపతి, శ్రీపార్వతీ దేవి, నందీశ్వర, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుంది.

వెండి శఠగోపం బహూకరణ

ఉరవకొండ: బూదగవి సూర్యనారాయణస్వామికి భక్తుడు పట్టణానికి చెందిన దొడగట్ట వీరశేఖర్ దంపతులు వెండి శఠగోపం సోమవారం బహూకరించాడు. సర్పంచ్ ధనంజయ, గ్రామపెద్దల సమక్షంలో అందించారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్‌తో భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ రంగయ్య, పార్టీ నాయకులు



శెట్టూరు మండలం అనుంపల్లిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రంగయ్య

- అనంతపురం ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప భరోసా అని ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందిన వారికి భరోసా కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. నియోజకవర్గంలోని కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన కె.గంగమ్మకు రూ.లక్ష, ఎనుములదొడ్డికి చెందిన సయ్యద్ జరీనాబీ కుటుంబానికి రూ.లక్ష, కళ్యాణదుర్గం మండలం ఉప్పవంకకు చెందిన టి.మౌనికకు రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.2.25 లక్షల చెక్కులను ఎంపీ అందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, జెడ్పీటీసీ బొమ్మన్న, చాపిరి సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశులు, జేసీఎస్ కన్వీనర్ తిమ్మరాజు, నాయకులు కొల్లప్ప, రాము, టైలర్ శీను, నాగేంద్ర, రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు

కళ్యాణదుర్గం: రాప్తాడులో ఆదివారం జరిగిన 'సిద్ధం' బహిరంగ సభ విజయవంతమైందని, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ శ్రేణులు సంసిద్ధమయ్యారన్నారు. సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పీచ్ కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. నియోజకవర్గం నుండి 20 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు సభకు హాజరయ్యారన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిమ్మరాజు ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ రంగయ్య తిమ్మరాజు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యును ఓదార్చారు.

శెట్టూరు: మండలంలోని అయ్యగార్లపల్లిలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం ప్రారంభోత్సవానికి ఎంపీ తలారి రంగయ్య హాజరయ్యారు. ఆయలంలో లక్ష్మీనరసింహస్వామికి, చిత్రలింగేశ్వర సామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు తిప్పేస్వామి, ఎమ్మెఎస్ రాయుడు, మంజునాథ, శేఖర్, చన్నప్ప, ఎర్రబాల, నాగన్న, చంద్రశేఖర్, గొల్ల నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

శెట్టూరు: మండలంలోని అనుంపల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రభాకర్, టీడీపీ పార్టీ నుంచి చిత్తప్ప కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ రంగయ్య పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ మంజు నాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్ పాలయ్య, ఎంపీటీసీ బీటీ ప్రకాష్, సీనియర్ నాయకులు నరసప్ప, సర్పంచ్ నాగరాజు, మహిళా నాయకురాలు సంధ్యారాణి, నాయకులు తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, పోస్ట్ రామకృష్ణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ

మండలంలోని అనుంపల్లిలో నూతన వధూవరులు మణికంఠ, శిరీషాను ఎంపీ రంగయ్య సోమవారం ఆశీర్వదించారు. పెళ్లికొడుకు తండ్రి కిష్టప్ప, పెళ్లి కుమార్తె తండ్రి బ్రహ్మయ్య, సీనియర్ నాయకుడు నరసప్ప, డీలర్ పాలయ్య, సుబ్బరాయుడు, పాలాక్షి, సురేష్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల సాయం

మండలంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఎంపీ తలారి రంగయ్య ఆర్థికం సాయం అందించారు. సోమవారం ఆలయాన్ని దర్శించుకున్న ఎంపీ.. ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రూ. 2,300 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.1307 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఐటీవింగ్ జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఐటీ వింగ్ సమావేశం నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 23న ఉరవకొండ పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారన్నారు. జీడిపల్లి గ్రామస్తులకు పునరావాసం కల్పించడానికి రూ.82 కోట్లు, హంద్రీనీవా ద్వారా ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లోని చెరువులకు నీరు అందించేందుకు ఫీల్డ్ ఛానల్స్ నిర్మాణానికి రూ.27.33 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీంతో పాటు 33, 34, 36 (ఏ) ప్యాకేజీ కింద ఆయకట్టుకు సాగు నీరు అందించడానికి రూ. 68.45 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కృషితో నియోజకవర్గం అభివృద్ధి జరుగుతోందన్నారు. ఐటీ వింగ్ నాయకులు సత్యంరెడ్డి, తేజమూర్తి, సాకే పురుషోత్తం, రాంబాబు, తిలక్, విష్ణు, మారుతి, సురేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎర్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎంపీ రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు సరోజా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 11.30 గంటలకు కుందుర్పి మండల కేంద్రంలోని వైఎస్సార్ ఆసరా సభలో పాల్గొంటారు.

పగిలిన సత్యసాయి పైపులైన్

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం సమీపంలో సత్యసాయి ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది.సోమవారం సత్యసాయి కార్మికులు పైపులైన్ మరమ్మతులు ప్రారంభించారు.

నేడు వలంటీర్లకు సన్మానం

బెళుగుప్ప: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, ఎంపీపీ పెద్దన్న తెలిపారు. స్థానిక బెళుగుప్ప–1 సచివాలయం వద్ద మధ్యాహ్నం 1 గంట నుంచి నిర్వహించనున్న కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథులు గా హాజరవుతారన్నారు. వలంటీర్లకు ఐదు సేవారత్న, 188 సేవా మిత్ర అవార్డుల ప్రదానం చేయనున్నారు.

వజ్రకరూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర, సేవా వజ్ర పురస్కారాలు అందించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు.

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే విశ్వ పరామర్శ



ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: కొకుంట్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి కుమారుడు కృష్ణను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అనంతపురంలోని సన్‌రే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యుల విశ్వేశ్వరరెడ్డి సూచించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మంజునాథ అనే యువకుడు రైలు కింద పడి సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు..శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నాగయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మంజునాథ ఇటీవల డిగ్రీ పూర్తి చేసి, ఓ గార్మెంట్స్ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం వాల్మీకీ నగర్ ఎదురుగా రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. రెండు కాళ్లూ పూర్తిగా కట్ అయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనం ద్వారా ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మెట్టు గోవిందరెడ్డి



పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్యపెట్టడానికి టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలు చెబుతున్నారని, నమ్మి ఎవరూ మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జక్కలవడికిలో సర్పంచు దంపతులు శారదమ్మ, హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సమన్వయకర్త మెట్టు టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. బావయప్ప గారి ఎర్రిస్వామి, గోవిందు, నాగరాజు, శీన, శేఖర్, ఈశ్వర్, బిల్ల హనుమంతు, ఆర్.రమేష్, జుగల తిప్పేస్వామి, పప్పుగోవిందు, శిమక్కదేవేంద్ర, బాదనాల మారెప్ప, చిన్నగారి శీన, జోగప్ప గారి బడెప్ప కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన ఆంజనేయులు, భార్య మాలక్ష్మి మాట్లాడుతూ తాము ముందు నుంచే వైఎస్సార్‌సీపీలో ఉన్నామని, టీడీపీలో చేరినట్లు ఆపార్టీ నాయకులు చెప్పడం సరికాదన్నారు. అనంతరం మెట్టు మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందేమీ లేదన్నారు. 57 నెలల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, వైస్ సర్పంచు ఖాజమ్మ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బోయ రమేష్, మాజీ సర్పంచు గిర్రప్పరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు టైలర్ వెంకటేశులు, బోయ రామకృష్ణ, బలరాం, భీమిరెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, అయ్యప్పరెడ్డి, భోగిరెడ్డి, వీరభద్రరెడ్డి, గొల్ల ఈరన్న, గొల్ల శీన, డిఎస్ వన్నూరుస్వామి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

రాయదుర్గం: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభ దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ జిల్లాలోని 52 నియోజకవర్గాల నుంచి సిద్ధం సభకు అంచనాలకు మించి జనం తరలివచ్చారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయేలా సభ జరిగిందన్నారు. రాయదుర్గం నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.సుమారు 10 లక్షల మంది ఒక వేదిక పైకి రావడంతో ఇదే తొలిసారి కాబోతుందన్నారు.

ఘనంగా వన్నూరుస్వామి ఉరుసు

కణేకల్లు:జక్కలవడికిలో సోమవారం వన్నూరు స్వామి ఉరుసు ఎంతో ఘనంగా జరిగింది. స్వామి వారి ప్రతిరూపంగా భావించే షంషీర్‌ను అశ్వంపై వేకువజామున గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంకాలం వన్నూరుస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బోయ రమేష్, యర్రగుంట మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మారెంపల్లి మారెన్న, యంత్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డి, బండి బసవరాజు, టీఎస్ఎస్ రౌఫ్, కోకుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన

రాయదుర్గం రూరల్: కెంచానపల్లిలోని శివాలయం గోపురంపై భక్తిశ్రద్ధలతో సోమవారం కలశస్థాపన చేశారు. ఆలయంలో గణపతి హోమం, పుణ్యాహవాచనం, నాంది, గంగపూజ, గో పూజ, నవగ్రహ హోమాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, గ్రామ సర్పంచ్ భారతి, సచివాలయాల కన్వీనర్ మురహరి, మల్లికార్జున, బుజ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి కూలీకీ ఉపాధి పనులు కల్పించాలి



వజ్రకరూరులో రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ విజయలక్ష్మి తదితరులు

వజ్రకరూరు: ప్రతి కూలీకీ ఉపాధిహామీ పనులు కల్పించనున్నట్లు డ్వామా ఏపీడీ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయాన్ని తనిఖీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఉపాధి పనులపై చర్చించారు. అనంతరం డ్వామా ఏపీడీ మాట్లాడుతూ ఉరవకొండ క్లస్టర్ పరిధిలోని ప్రతి మండలంలో 1000 కుటుంబాలకు వందరోజులు పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. క్లస్టర్ పరిధిలో హార్టికల్చర్ కింద మొక్కలు, పండ్లరకాల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మి, ఈసీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రెండు సచివాలయాల్లో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ మాలిక్ ఓ ప్రకటనలో తెలిపారు. కోటలోని 13వ సచివాలయం, 7వ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని సబ్ పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్టుమాస్టర్ పద్మావతి తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నెలరోజుల నుంచి ఆధార్ నమోదు కేంద్రం కొనసాగుతోందని, అనంత గ్రామీణ బ్యాంకు, ఎస్‌బీఐలో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

రాయదుర్గం రూరల్: మండలంలో 20 నుంచి 23వరకు ఆధార్ క్యాంపులు ఉంటాయని ఎంపీడీఓ అల్లా బకాష్ తెలిపారు. 20న టి.వీరాపురం, జుంజురాంపల్లి, చదం గొల్లలదొడ్డి, 21న డి.కొండాపురం, బీఎన్ హళ్లి, మెచ్చిరి, 22న బొందనకల్లు, 74 ఉడేగోళం , చదం గ్రామాల్లోను, 23న మల్లాపురం, వడ్రహొన్నూరు, పల్లేపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు సామాజిక తనిఖీ

రాయదుర్గం రూరల్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డబ్ల్యూడీసీ–పీఎంకేఎస్‌వై పథకం ద్వారా కొండాపురం ప్రాజెక్ట్ పరిధిలో 20న సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు పీఓ శ్రీవిద్య తెలిపారు. 2022 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి 31 వరకు చేపట్టిన పనులపై ఉదయం 11 గంటలకు గ్రామదట్ల గ్రామం పంచాయతీ కార్యాలయం, 12 గంటలకు టి.వీరాపురం సచివాలయం , మధ్యాహ్నం 3 గంటలకు డి.కొండాపురం సచివాలయంలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 21న కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

గుమ్మఘట్ట: మండలంలోని ఎస్.హొసళ్లి, కలుగోడు, రంగచేడు గ్రామాల్లో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిల్లలపల్లి జైపాల్ పురవకొండ పౌలు, డేవిడ్‌పాల్ వినయ్, శాలిమోషే, సంఘ కాపరి జాన్సన్, మనోహర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

27న బండిమోటు వేలం

రాయదుర్గం రూరల్: స్థానిక మద్దానేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, పశువుల జాతర సందర్భంగా ఈనెల 27న బండిమోటు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, గ్రూపు ఆలయాల కార్య నిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మార్చి 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండిమోటు వసూళ్ల కోసం ఫిబ్రవరి 27న వేలం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

జంబుగుంపల అడవికి నిప్పు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంతానికి గుర్తు తెలియని పశువుల కాపర్లు నిప్పు పెట్టడంతో సుమారు 4 వందల ఎకరాల్లో అడవులు కాలిపోయాయి. గౌరమ్మపెంట, తుమ్మర్లగొంది, ఊరుకొండ, దావానుపెంట తదితర ప్రాంతాల్లో పచ్చని చెట్లు కాలిపోయాయి. ఏటా కాపర్లు ఏదో ఒక ప్రాంతంలో అడవులకు నిప్పు పెడుతూనే ఉన్నారని, ఉదయం నుంచి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నామని అటవీ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప తెలిపారు.

విద్యార్థులకు ఆంగ్లభాష అవసరమే



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న జిల్లా ఉప విద్యాధికారి శ్రీనివాసరావు

శెట్టూరు: విద్యార్థులకు ఆంగ్లభాష కూడా అవసరమేనని జిల్లా ఉప విద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ' ఇంగ్లిష్ ఫెస్టివల్ ' నిర్వహించారు. ఈ ఫెస్టివల్ కార్యక్రమంలో కుందుర్పి, శెట్టూరు మండాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్లభాషపై మక్కువ, అవగాహన ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్ ఖాన్, ఆంగ్ల ఉపాధ్యాయులు గోవిందురాజులు, రామాంజనేయులు, రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్ ' అవార్డుకు విద్యార్థిని ఎంపిక

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని ఎస్.సుహానా రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు తెలిపారు.

ఈఈ మెరిట్ టెస్ట్‌లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి, 7వ తరగతి విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈఈ మెరిట్ 2024 పరీక్షల్లో రాయదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం జిల్లా నుంచి ప్రథమ స్థానంలో నిలిచి శభాష్ అనిపించారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం.జిగ్నేష్ ప్రథమ స్థానం , చరిత ద్వితీయ స్థానంలో నిలిచారు. 7వ తరగతి విద్యార్థిని తనూజ జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. పదోతరగతి విద్యార్థి సాయి అమోఘ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు తెలిపారు.

చిందనూరు నగేష్ మృతి

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన ఏపీ బులియన్ అసోసియేషన్ సహ కార్యదర్శి, రాయదుర్గం జువెలరీ, స్వర్ణకార సంఘం మాజీ కార్యదర్శి చిందనూరు నగేష్(50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మెట్టు గోవిందరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి తదితరులు చిందనూరు మృతదేహం వద్ద నివాళులర్పించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం జువెలరీ షాపు యజమానులు సోమవారం బంద్ పాటించారు.

పీహెచ్‌సీ ఎదుట ప్లాట్‌ఫాం ఏర్పాటు

కూడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ ఎదుట పిచ్చి మొక్కలు, గడ్డి ఉండడంతో తరుచూ విషపురుగులు తిరుగుతుండేవి. దీంతో సిబ్బంది, వైద్యం కోసం వచ్చే రోగులు భయాందోళన చెందేవారు. దీనిపై 'సాక్షి'లో 'పీహెచ్‌సీలో పాముల బెడద' , 'పార్మసిస్టుకు తప్పిన పాము కాటు ప్రమాదం' శీర్షికతో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించారు. చుట్టుపక్కల ఉన్న గడ్డిని కూడా తొలగిస్తామని వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.

నగరేశ్వరాలయంలో పూజలు



అలంకరణలో నగరేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని ఉదమం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం,రుద్రాభిషేకం,మహామంగళ హారతి, తీర్థప్రసాదవినియోగం చేశారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: పాలిసెట్ కోర్సుకు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని బోరంపల్లి పాలటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ సోమవారం తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించి, ఏప్రిల్ 5వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని ఐపార్సపల్లి ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ రంగయ్య రూ.3,95,000 విడుదల చేశారు. కార్యక్రమంలో కురువ సంఘం తాలుకా అధ్యక్షుడు దొణస్వామి, నాయకులు బాస్కర్, పాతలింగ్స, రఘు, కిరిటీ పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట

కళ్యాణదుర్గం రూరల్: తిమ్మగానిపల్లిలో మహిళా రైతు రామాంజనమ్మకు చెందిన 1.50 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారు. రూ.1.50లక్ష నష్టపోయినట్లు బాధితురాలు వాపోయింది.

'వలంటీర్లకు వందనం' వాయిదా

రాయదుర్గం రూరల్: ఈనెల 20న జరగాల్సిన వలంటీర్లకు వందనం కార్యక్రమం అనివార్య కారణాలతో ఈనెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.